క్లుప్తంగా

ఐరాలలో తిరంగా యాత్ర



ఐరాలలో జాతీయ జెండాలతో నిర్వహిస్తున్న ర్యాలీ

ఐరాల: పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకుని సైనికులకు సంఘీభావంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం గురువారం తిరంగా యాత్ర నిర్వహించింది. జెండామాను నుంచి బజారు వీధి వరకు ర్యాలీ నిర్వహించింది. భారత్ మాతాకీ జై, జైజవాన్, జై కిసాన్, వందేమాతరం నినాదాలతో పురవీధులు హోరెత్తాయి. కార్యక్రమంలో మాజీ సైనికులు, దుకాణాల యజమానులు, స్థానికులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఏకాగ్రత



శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి సుజాత

ఐరాల: యోగా, ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు చేయడం, సంగీతం, యోగా, చదరంగం, జీకే, స్పోకెన్ ఇంగ్లిష్.. ఇత్యాది వాటిల్లో శిక్షణ ఇచ్చారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా చిన్నారుల్లో సృజనాత్మకత పెంచడానికి ఈ శిబిరాలు దోహదపడతాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎగువ మత్యంలో చర్చి నిర్మాణానికి విరాళం



రూ. లక్ష చెక్కును గ్రామస్తులు, పాస్టర్‌కు అందజేస్తున్న మురళీకృష్ణ

తవణంపల్లె: మండలంలోని ఎగువ మత్యంలో చర్చి నిర్మాణానికి బంగారుపాళ్యం మండలానికి చెందిన సినీ హీరో మురళీకృష్ణ గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. పాస్టర్ శ్యాం ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయన్ను ఆశీర్వదించి సత్కరించారు. ఎగువ మత్యం గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎగువమత్యం యూత్, ఉపదేశకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి



చుక్కావారిపల్లెలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గర్భిణులపై ప్రత్యేక దృష్టి తీసుకుంటున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. చుక్కావారిపల్లె గ్రామంలో గురువారం ప్రపంచ ప్రీ ఎక్లంప్సియా డే సందర్భంగా గర్భిణులు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, చంద్రశేఖర్, అనురాధ, శివగామి పాల్గొన్నారు.

వేసవిలో పశువులు కూడా వడదెబ్బకు గురవుతున్నాయి. వేసవిలో పశుపోషణలో నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బకు గురై మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ నివారణ గురించి స్థానిక పశువైద్యాధికారి సాయిసుధ రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. వడదెబ్బ లక్షణాలు, చికిత్స, నివారణ గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. మండుటెండల్లో జాగ్రత్తలు పాటిస్తేనే పశుసంపదను కాపాడుకోగలరని తెలిపారు.

పశువులకూ వడదెబ్బ



- నిర్లక్ష్యం వహిస్తే మరణించే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

గుడిపాల: ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాల్లో, ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉంచినప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు పశువులు అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి.

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

వేసవిలో బయటి ఉష్ణోగ్రతలు పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథలామస్ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతుంది. ఆ సందర్భాల్లో చర్మంపై గల స్వేద గ్రంథులు చెమట అధికంగా ప్రసారం చేసి పశువులకు అధిక ఉష్ణోగ్రతలకు లోనుకాకుండా కాపాడుతాయి. అదే సమయంలో చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక చనిపోతాయి.

నివారణ చర్యలు

- పశుపోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు, పోషణ విషయంలో శ్రద్ధ తీసుకుంటే వడదెబ్బ నుంచి పశువులను రక్షించుకోవచ్చు. వేసవిలో పగటి వేళ పశువులను మేతకోసం బయటకు వదలరాదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయట తిరగనివ్వాలి. తాగునీటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి.
- పశువులను రోజూ మూడుసార్లు శుభ్రమైన నీటితో కడగాలి. నాటుజాతి పశువుల కంటే శంకరజాతి పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. చెరువులు, కుంటలు ఉన్నట్లయితే పశువులను ఈదనివ్వాలి.
- వెలుతురు, గాలి బాగా ప్రసరించేలా ఎత్తయిన పశువుల శాలను గడ్డితో నిర్మించుకోవాలి.
- వడగాలి తగలకుండా గోనె సంచులు కప్పుకోవాలి.
- ముఖ్యంగా మురుగునీరు, కలుషిత నీరు తాగకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగేలా ఏర్పాటు చేయాలి.

లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీ ఫారెన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటివెంట చొంగ పడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడ కోసం చెట్ల కిందకు చేరతాయి. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలు దాటితే శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. ఫిట్స్ లక్షణాలతో పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల నుంచి 106 డిగ్రీలు దాటితే ప్రాణాపాయం సంభవిస్తుంది. వడదెబ్బ వల్ల చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడి తాత్కాలిక వ్యంధత్వం సంభవిస్తోంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.



చల్లని ప్రదేశంలో ఉంచాలి

పశువు వడదెబ్బకు గురైందని గుర్తించిన వెంటనే రైతులు పశువులను నీటితో కడిగి, చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రతను గమనించి ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరే వరకు పలుమార్లు నీటితో కడగాలి. వెంటనే సమీపంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించి తగిన చికిత్సలు చేయించుకోవాలి.

సాయిసుధ,
పశువైద్యాధికారి, గుడిపాల

నోటీస్ బోర్డు

24న 'రేలా రే రేలా'

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈనెల 24న చిత్తూరులో రేలా రే రేలా జానపద గీతాలు, దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శనను నిర్వహించనున్నట్టు జానపదం సంస్థ నిర్వాహకులు దామోదర్ తెలిపారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కట్టమంచిలోని శాంత రఘురామన్ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి విరాళం



గౌరీ యూత్ సభ్యులకు చెక్ అందజేస్తున్న హీరో మురళీకృష్ణ

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో ఆలయ ముఖద్వార నిర్మాణానికి గురువారం మండలంలోని మాధవనగర్‌కు చెందిన సినీ హీరో మానినేని మురళీకృష్ణ (జెట్టి సినిమా ఫేం) బొమ్మాయిపల్లెలో గౌరీదేవి ఆలయ నిర్మాణానికి గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు, గౌరీ యూత్ సభ్యులు వినతిపై స్పందించి ఈ విరాళం అందజేసినట్టు ఆయన చెప్పారు. అలాగే హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఐదేళ్ల నుంచి పేదలకు రోజూ మధ్యాహ్నం రూపాయికే భోజనం పెడుతున్నట్టు చెప్పారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవం.. ద్రౌపదీ కల్యాణం

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపదీ కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఇందులోభాగంగా ద్రౌపది, ధర్మరాజుల ఉత్సవమూర్తులకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహించారు. భాగవతారిణి రాణిరెడ్డి కల్యాణోత్సవ ఘట్టంకు సంబంధించి హరికథను భక్తులకు వినిపించింది. ఆలయ ధర్మకర్త మొగిలిరెడ్డి పాల్గొన్నారు.



బంగారుపాళెం ఇందిరమ్మ కాలనీ వద్ద గుంతల రోడ్డుపై నారు నాటి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- వరి నారు నాటి వినూత్న నిరసన

బంగారుపాళెం: గుంతలమయమైన బంగారుపాళెం-రాగిమానుపెంట గ్రామీణ రహదారి బాగుచేయాలంటూ గురువారం రాగిమానుపెంట గ్రామస్తులు గుంతల రోడ్డులో నారు నాటి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, బంగారుపాళెం- రాగిమానుపెంట గ్రామీణ రహదారిపై నిత్యం ఐదు పంచాయతీలకు చెందిన 15 గ్రామాల వారు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. రోడ్డుపై వాహనాలు ప్రయాణించేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. ఏడాదిగా గుంతలమయమైన రోడ్డును బాగుచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల రహదారిలో బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారిందని, ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్డును బాగుచేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న రైతు నాయకులు

పూతలపట్టు (కాణిపాకం): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడితే ప్రజల ఆరోగ్యవంతులుగా ఉంటారని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు మాంగాటి గోపాల్ రెడ్డి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై గురువారం పూతలపట్టు మండలం పి.కొత్తకోటలోని ఒక కల్యాణ మండపంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాంగాటి మాట్లాడుతూ, రసాయన ఎరువులతో పండించే ఆహారోత్పత్తుల వినియోగం వల్ల కాలక్రమంలో పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని, వీటి బారిన పడకుండా ఉండాలన్నా, భావితరాలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నా ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలన్నారు. ఎస్‌పీకే ప్రచారకులు చందుకుమార్ రెడ్డి, మహారాష్ట్ర చెందిన సుభాష్ పాలేకర్ కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయంపై దేశమంతా అవగాహన కల్పిస్తున్నారని, వారి స్ఫూర్తితో అందరూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకుడు చంగల్రాయరెడ్డి, రైతులు రాజారత్నం రెడ్డి. ప్రభాకర్‌రెడ్డి. కృష్ణమూర్తిరెడ్డి, బాబు కిరణ్, వెంకట నరసింహులు, జగన్నాథరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగస్తులకు ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులోని ప్రశాంత్‌నగర్, కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేశారు. అందరికీ ఆభ ఐడీ నమోదు చేయించారు. కార్యక్రమంలో డీఐఓ హనుమంతరావు, అనిల్‌కుమార్, ప్రవీణ, అనూష, గిరి పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు 9 ఫిర్యాదులు

– డీఈ కొండయ్యపై రిటైర్డ్ జడ్జి ఆగ్రహం

చిత్తూరు కార్పొరేషన్: మూడేళ్లగా విద్యుత్ సర్వీసు కోసం వేచి చూస్తున్నామని బంగారుపాళ్యం మండలం కేజీ సత్రానికి చెందని నిర్మల తెలిపారు. గురువారం ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో ఆమె ఫిర్యాదు చేశారు. గురువారం కమిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి ఫిర్యాదులను స్వీకరించారు. మూడేళ్ల కిందట విద్యుత్ కనెక్షన్ కోసం నగదు చెల్లించినా ఇప్పటి వరకు సర్వీసు ఇవ్వలేదని నిర్మల తెలిపారు. డీఈ కొండయ్యపై రిటైర్డ్ జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సర్వీసు ఇవ్వాలని, విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మొత్తం 9 సమస్యలను వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఇందులో చిత్తూరు సంతపేట సాయినగర్‌లో మంజూరైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, మురకంబట్టు, బంగారుపాళ్యంలో కొత్త సర్వీసులు విడుదల చేయాలని 3 ఫిర్యాదులు ఇచ్చారు. చిత్తూరు రూరల్ పరిధిలో వాణిజ్య సర్వీసుకు బిల్లు రివిజన్ చేయాలని, అదనపు లోడ్ రివిజన్ చేయాలని, రెడ్డిగుంటలో సర్వీసు పేరు మార్చాలని, కొత్తపల్లెలో కేటగిరి మార్పు, లూజ్‌లైన్‌ను బిగుతు చేయాలని సమస్యలను తెలిపారు. సమస్యలను నమోదు చేసుకొని వాటిని పరిష్కారించాలని శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆదేశించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్అహ్మద్, ఈఈ మునిచంద్ర, ఏఓ ప్రసన్న ఆంజనేయులు, డీఈలు ఆనంద్, కొండయ్య, టెక్నికల్ ఏఈ మాధురి, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు పాల్గొన్నారు.



కొండయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

జనాభా ప్రాతిపదికన నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

చిత్తూరు అర్బన్: జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు జోరేపల్లి రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు అన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం గురువారం ఎస్టీయూ కార్యాలయంలో జయశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిత్తూరు నగరం విస్తీర్ణం, జనాభాకు తగ్గట్టు పారిశుధ్య కార్మికులు లేరన్నారు. సిబ్బంది సంఖ్యను ప్రభుత్వం పెంచకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే కార్మికులకు సోపు, చెప్పులు, యూనిఫాంతో పాటు ప్రతి కార్మికునికి కుట్టు కూలి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు మణి, బుర్ర మంజునాథ బాబు, వాసు, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, రమణి, సుకన్య, బుల్లెమ్మ చిత్ర, కస్తూరి పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా హనుమజ్జయంతి

తవణంపల్లె: హనుమజ్జయంతి పురస్కరించుకుని మండలంలోని అర్ధగిరి పుణ్యక్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆలయ మండపంలో వేదపండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హోమంలో కాణిపాకం ఆలయ ఈఓ పెంచలయ్య కుటుంబ సభ్యులు, అర్ధగిరి క్షేత్రం ఆలయ ఈఓ హనుమంతురావు, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ సురేంద్ర రెడ్డి కుటుంబసభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు సహస్రనామ పూజ, రాత్రి 7 గంటలకు ఉత్సవ విగ్రహానికి అర్చకులు అభిషేకం, పూజలు నిర్వహించారు. పల్లకిలో కొలువైన ఆంజనేయస్వామి ప్రాకారోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. అలాగే, అర్ధగిరి వీరాంజనేయ స్వామిని కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఈఓ పెంచల కిషోర్ తమ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. అనంతరం మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అర్ధగిరి క్షేత్రంలో నేడు

శుక్రవారం ఉదయం 5 గంటలకు స్వామికి సుప్రభాత సేవ, వేదపారాయణం, 9 గంటలకు వసంతోత్సవం, నివేదన, మహామంగళ హారతి ఉంటుందని ఆలయ ఈఓ తెలిపారు.

చిల్లారపల్లెలో..

సరకల్లుకు చెందిన చిల్లారపల్లె(ఎస్. కృష్ణాపురం)లో రాతి గుండుపై ప్రతిష్ఠించిన వరగిరి వీరాజంనేయస్వామికి అభిషేకం, పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో మాజీ ఎంపీపీ గీతారెడ్డి, హరికృష్ణారెడ్డి, గణేష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రమణారెడ్డి, రవిరెడ్డి, శాంతిసాగర్ రెడ్డి, స్థానికులు, పరసర గ్రామస్తులు పాల్గొన్నారు. రాత్రి వీధినాటకం ప్రదర్శించారు. అలాగే ఎగువ మత్యంలో అభయాంజనేయస్వామి, గాజులపల్లెలో ఆంజనేయ స్వామికి భక్తులు అభిషేకం, పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



బంగారుపాళెం: మొగిలి వెంకటగిరిలో ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి



చిత్తూరు రూరల్: అలంకరణలో వీరాంజనేయస్వామి

మొగిలి వెంకటగిరిలో..

బంగారుపాళెం: హనుమజ్జయంతి పురస్కరించుకుని గురువారం మండలంలో మొగిలి వెంకటగిరిలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సమితి అధ్యక్షులు తులసీ రామకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ దీప, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులోని పొన్నియమ్మ గుడివీధి, గిరింపేట, జెండామానువీధిలో వీరాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాలతో ఆలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. స్వామి వారిని వడమాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పొన్నియమ్మ గుడివీధిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



అర్ధగిరిలో వేదపండితులు చేస్తున్న హోమం



వరగిరి వీరాంజనేయస్వామికి చేస్తున్న పూజలు

జగనన్న కాలనీలో సాయిబాబా మండల పూజలు



సాయిబాబా మందిరంలో చేస్తున్న హోమంలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో గురువారం షిరిడిసాయిబాబా మండల పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ సాయిబాబా మందిరం నిర్మించి, విగ్రహం ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభిషేక పూజల అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్మాణకర్తలు పాలకూరు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.